జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక


మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 19-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 400 పేజీలు: 4 వెల : రూ.7

# ప్రజాదర్బార్‌కు.. పోటెత్తారు!





* ప్రతి శుక్రవారం టీడీపీ కార్యాలయాలు క్యాంపు కార్యాలయాల్లో దర్బార్ * వినతులు అందించేందుకు తరలివస్తున్న ప్రజలు * అర్జీల పరిష్కారం కావడం లేదంటున్న ప్రజలు * మళ్లీమళ్లీ అవే అర్జీలపై నేతల ఆగ్రహం * మండల కార్యాలయాల్లో మొక్కుబడిగా గ్రీవెన్స్‌సెల్ * ప్రతివారం వారం మూడంకెలకు చేరుతున్న వినతులు * పెండింగ్‌లోనే అర్జీలపై తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

**శ్రీకాకుళం, జూలై 18 (వార్త):** ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు తమ క్యాంపు కార్యాలయాలు, టీడీపీ కార్యాలయాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు, వినతిపత్రాలు అందించేందుకు బారులు దీరుతున్నారు. ఎక్కువగా భూ సమస్యలు, పథకాలు అందడం లేదంటూ అర్జీలే వస్తున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలో ఉన్న సమయంలో నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఇక ఎమ్మెల్యేలు శుక్రవారం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటూ సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నారు. ఇక ప్రతి సోమవారం శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో, పోలీసు కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ సైతం ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్నారు. ఇక మండల రెవెన్యూ కార్యాలయాల్లో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. మొక్కుబడిగానే చేపడుతున్నారు. మండల కార్యాలయాల్లో అర్జీలు ఇస్తుంటే అవి పరిష్కారం కావడం లేదన్న ఉద్దేశంతో ప్రజలు సైతం జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌కు, ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు తరలివస్తున్నారు. గ్రీవెన్స్‌కు సైతం వస్తున్న అర్జీలు వారం వారం పరిశీలిస్తే మూడంకెలకు చేరుతున్నాయి. వాటిని అధికారులు మండల అధికారులకు ఎండార్స్ చేస్తున్నా పరిష్కారం కావడం లేదు. దీంతో మళ్లీమళ్లీ అవే సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కొన్ని శాఖల అధికారులు వీటిని పరిష్కరించడం లేదు సరికదా.. ఫిర్యాదు చేసిన వారికి సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో అవే సమస్యలను పలువురు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో ఇవే ఫిర్యాదులు ప్రజాదర్బార్‌లోకి వస్తుండడం, గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు ఇస్తునే ఉన్నామని, పరిష్కరించడం లేదని కొందరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న అర్జీదారుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని, లేకుంటే ప్రతివారం నిర్వహించే గ్రీవెన్స్‌తో పాటు ప్రజాదర్బార్ పోటెత్తే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

# ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం లక్ష్యం

* ప్లాస్టిక్ నియంత్రణ ప్రజా ఉద్యమం కావాలి
* ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

**శ్రీకాకుళం, జూలై 18(వార్త):** శ్రీకాకుళం నగరాన్ని అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ (రిటైర్డ్ ఐఏఎస్) డాక్టర్ పి కృష్ణయ్య పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం వీసీ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.'స్వచ్ఛ శ్రీకాకుళం' అనే నినాదానికి కట్టుబడి, పట్టణం నుంచి గ్రామ స్థాయి వరకు ప్లాస్టిక్ నియంత్రణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఆర్టీవో, ఆర్టీసీ, మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్త చర్యలతో రహదారులు, బస్ స్టాండ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత సందేశాలతో సైన్‌బోర్డులు తక్షణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి డ్రైవర్స్, ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులను లక్ష్యంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 నుంచే అమల్లో ఉన్నాయని, వీటి ప్రకారం మున్సిపల్ స్థాయిలో విడదీసే సేకరణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ వ్యవస్థలు తప్పనిసరి అని కృష్ణయ్య గుర్తు చేశారు. అనుమతిలేని పలచని క్యారీ బ్యాగులు, మల్టీ లేయర్డ్ ప్యాకేజింగ్ వినియోగ నియంత్రణపై కఠిన చర్యలు ఉండాలని



అన్నారు. ఉత్పత్తిదారులు, దిగుమతిదారులు, బ్రాండ్ యజమానులు విస్తరిత ఉత్పత్తిదారుల బాధ్యత (ఇపిఆర్) కింద సేకరణ- రీసైక్లింగ్‌కు ముందుండాలని, అవసరమైతే బై బ్యాక్ డిపాజిట్ విధానాలు అమలు చేయాలని సూచించారు. స్థానిక సంస్థలు ప్లాస్టిక్ చెత్తను ప్రత్యేకంగా సేకరించి మళ్లీ ఉపయోగించే చక్రంలోకి తేవాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘనలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జరిమానాలు, కేసులు, లైసెన్స్ రద్దు వంటి శిక్షలు విధించే అధికారం కలిగి ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను గురించి కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఫర్మాన్ అహ్మద్ ఖాన్, దౌనక పృథ్వీరాజ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ కరుణశ్రీ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బివిడి ప్రసాద్ రావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

* సంతబొమ్మాళి మండల కార్యకర్తల సమావేశంలో ధ్వజమెత్తిన వైసీపీ జిల్లా నేతలు



4లో

ఆధునిక పరిజ్ఞానంతో
# కాలుష్య నియంత్రణ



2లో

# 260 మంది కవుల కవితలే మంజూరు

* వక్తలు వెల్లడి * హరిపురంలో పుస్తకావిష్కరణ

**మందస, జులై 18(వార్త):** ఉత్తరాంధ్రలోని 260 మంది కవుల కవితలే 'మంజూరు' అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మందస మండలంలోని హరిపురం శాతవాహన డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సిక్కోలు ఉద్దానం జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో 'మంజూరు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని 260 మంది కవులు ఈ పుస్తకంలో కవితలు రాసి సామాజిక చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించారన్నారు. ఉపాధ్యాయుడు దుప్పల రవికుమార్ సంకలనం చేసిన మంజూరు పుస్తకాన్ని కవి నల్లి ధర్మారావు ఆవిష్కరించారు. సిక్కోలు జానపద కళ వేదిక అధ్యక్షులు మామిడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేదిక పూర్వపు అధ్యక్షుడు రాపాక ధనరాజు, విశిష్ట అతిథి డాక్టర్ కుమార్ నాయక్, కవులు, రచయితలు, గాయకులు ఉపాధ్యాయులు కె.కృష్ణమూర్తి, డాక్టర్ కుమార్ నాయక్, కుత్తుం వినోద్, పి,రాజేంద్ర, ఎం.గణపతి, గొరకల లోకేశ్వరరావు, ఆర్.ధనరాజు, దున్న రామారావు, దాసరి తాతారావు, బత్తిని నారాయణ, లబ్బ రుద్రయ్య, కె.రాజేంద్ర, శాతవాహన డిగ్రీ, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు, ఏవో బిన్నల శివ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## సీఎంఆర్ఎఫ్ అందజేసిన ఎంఎల్ఏ శిరీషా



**మందస, జులై 18(వార్త):** అంబుగాంకు చెందిన మజ్జి ప్రవీణ్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.91,000లు పలాస ఎంఎంఏ గౌతు శిరీష అందించారు. ప్రవీణ్ తండ్రి తిరుమలరావు అనారోగ్యంతో బాధపడుతుండగా ఈ సాయం అందించారు. సహాయం అందించడానికి కృషి చేసిన పలాస నియోజకవర్గం ఎంఎల్ఏ గౌతు శిరీష, తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్నచౌదరి, గ్రంధాలయం మాజీ చైర్మన్ పీరికట్ల విఠల్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్ కంచరాన అనిల్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు జనసేన పార్టీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొర్ల కన్నారావు, డుంకురు తిరుపతిరావు, రాజాన మహేష్ పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుకు ప్రజాభిప్రాయం సేకరించరా?

**-సర్వేల పేరుతో అధికారులు,**

**ప్రైవేటు కంపెనీల పెత్తనం వద్దు.**

**-భూములపైకి వస్తే ఉద్యమం మరింత ఉధృతం**



**మందస, జులై 18(వార్త):** పచ్చని ఉద్దానంలో కనీసం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా కార్గో ఎయిర్పోర్ట్ నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడడం తగదని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన బాధిత రైతులతో జుత్తు జగన్నాయికులు సంఘ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బిడిమి గ్రామం నుంచి ఇరోతు కృష్ణారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శిరీష పలాస టీడీపీ ఆఫీస్ లో కొంతమంది రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాగైనా ఉద్ధానం ప్రాంతంలో ఎయిర్పోర్ట్ నిర్మించి తీరుతానని చెప్పడాన్ని బిడిమి గ్రామం బాధిత రైతులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సర్వేలు పేరుతో అధికారులు, ప్రైవేటు కంపెనీలు బిడిమి భూమిల పైకి వస్తే ఎలా వెనక్కి పంపించామో.. భవిష్యత్ లో కూడా ప్రజాభిప్రాయ ఆమోదం లేకుండా భూమిలపైకి వస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బాధిత రైతులు తరుపున హెచ్చరిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేకు ఆహ్వానం పలుకుతున్నామని, పచ్చని ఉద్ధానంలోని 16గ్రామాల్లోని రైతులు అభిప్రాయం సేకరణ తీసుకోవాలని కోరారు. అంతేకానీ, ఎక్కడో పార్టీ ఆఫీసుల్లో కూర్చొని గ్రామాల్లో ఉన్న రైతులు మధ్య తగాదాలు సృష్టిస్తే మాత్రం ఒప్పుకోబోమన్నారు. 9నెలలు నుంచి రైతులంతా వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే, పోలీసు బలగాలను మోహరించి కొలతలు వెయ్యడం మీకు ఇది తగునా అని ప్రశ్నించారు. ఎవరైతే కొంతమంది ఎయిర్పోర్ట్ కి అనుకూలంగా ఉన్నారని మీరు చెప్తున్నారో వాళ్ళతో కూడా మా బాధిత రైతులు కలిసి తమ వంతు ప్రయత్నాలు కూడా చెయ్యడం ఇప్పటికే మొదలు పెట్టామన్నారు. మరోసారి పునః పరిశీలించి కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం నిలుపుదల చేయాలని మనవి చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, చీపురుపల్లి సర్పంచ్ జోగి అప్పారావు, బత్తిని లక్ష్మణ్, రైతులు దున్న హరికృష్ణ, తెప్పల కృష్ణారావు, జుత్తు కోటేశ్వరరావు, జుత్తు ధర్మారావు, జుత్తు లోకనాధం, తెప్పల అప్పారావు, తెప్పల లోకనాధం, కోట ధనరాజు, మెట్టూరి యశోద, మెట్టూరి ఆదిలక్ష్మి, మెట్టూరి లక్ష్మీ, తెప్పల మహాలక్ష్మి, జుత్తు సింహాద్రి, పుచ్చ లచ్చయ్య, పొట్టి ఎర్రయ్య, తామాడ తుంభనాధం, దున్న రామారావు, చిత్త గున్నయ్య, జుత్తు భూపతి, సుంకరి రాజు, నల్ల పరుశు రాం, మర్ల సంతోష్, గుంటు లోకనాధం, బాలక్రిష్ణ తదితర బాధిత రైతులు పాల్గొన్నారు.

# స్వీయ ధ్రువీకరణ ఇళ్ల నిర్మాణదారులకు వరం



**పలాస, జులై 18(వార్త):** ఇంటి నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు"స్వీయ దృవీకరణ పథకం" ఒక వరమని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామా రావు అన్నారు. టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్ కమిష నర్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారు నూతనంగా ప్రవేశపెట్టిన భవన నిర్మాణాలకు సంబంధించి స్వీయ దృవీకరణ పథకం పేరుతో పేద, మధ్యతరగతి వారికి ఈ పథకం కింద వెంటనే అనుమతులు మంజూరు కలిగేలా చట్టాన్ని రూపొందించారు. దీనితో కార్యాలయమునకు వెళ్లాల్సిన పని లేకుండానే అనుమతుల కోసం ఎవరు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఇంటి నిర్మాణ అనుమతులు మీకు అందేలా ప్రభుత్వం వారు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఈ పథకం కింద 100 నుంచి 200 చదరపు గజాలలోపు పేదలు, మధ్య తరగతి వారు ఇండ్ల నిర్మాణానికి అనుమతులు సులభతరం చేయడంతో వీరికి లబ్ధి చేకూరనుంది. ఈ పథకంలో లైసెన్సు కలిగిన సాంకేతిక నిపుణులను కలిస్తే మీ యొక్క డాక్యుమెంట్లు, ఈసీ, ఖాళీ స్థలానికి చెల్లిస్తున్న పన్ను ఇలా సాంకేతిక నిపుణులు అడిగిన కాగితాలను అందించి వాటిపై సంతకాలు చేసి ఫీజు చెల్లిస్తే చాలు మీ యొక్క ఇంటి నిర్మాణ అనుమతి పని పూర్తయినట్లే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వారు మాట్లాడుతూ పురపాలక సంఘంలో గల అక్రమ కట్టడాలను గుర్తించి వాటిపై స్థానిక కోర్టులో కేసులు నమోదు చేసి పురపాలక సంఘ ఆదాయమును మెరుగుపరచవలసిందిగా కోరారు. ఇంకనూ ఈ పురపాలక సంఘంలో ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితో కూడా బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ పై అవగాహన కల్పించ వలసింది గా సూచించారు. ఈ పురపాలక సంఘంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకొనుటకు గాను ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది కూడా సహకరించాలని కమిషనర్ వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘము పరిధిలోని అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక పరిజ్ఞానంతో కాలుష్యాన్ని నియంత్రించాలి

**- పరిశ్రమలో మొక్కలు నాటండి**

**-కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య**




పలాస, **జులై 18(వార్త):** కాలుష్య నియంత్రణకు ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించాలని, పరిశ్రమంలో మొక్కలు నాటి కాలుష్యం నియంత్రించాలని, సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్యాన్ని నివారించుకోవచ్చని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య జీడి పరిశ్రమ దారులకు సూచించారు. శుక్రవారం పలాస క్యాష్య అసోషియేషన్ భవనంలో జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ జీడి పరిశ్రమ బాయిలింగ్ విదానంలోనికి రావడంతో పలు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించేందుకు ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న టెక్నాలజీని వినియోగించుకొని, పరిశ్రమల ద్వారా కాలుష్యం వెలువడకుండా నివారించే చర్యలు వ్యాపారులు చేపట్టాలన్నారు. పాత రోజుల్లో మాదిరిగానే ఇంకా ఉంటామంటే పద్ధతి కాదని ప్రతీ ఒక్కరిలో మార్పు రావాలన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు కావాలని, గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమల మాదిరిగా చిరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కొత్త పధకాలు, కొత్త సాంకేతికత వినియోగించుకొని పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విదానాలలో కాలానుగుణంగా మార్పులు చేసుకోకపోతే 70 ఏళ్ల నాటి పరిశ్రమ అంతరించిపోయే అవకాశం ఉందని గుర్తించాలన్నారు. అదే విదంగా దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తే స్థాయికి చేరుకొని లబ్ధి పొందాలన్నారు. విదేశాలలో ఉన్న కొన్ని టెక్నాలజీలను పరిశీలించి ఇక్కడ అమలు చేయాలన్నారు. జీడిపప్పు విక్రయించడమే కాకుండా జీడిపప్పుతో చెక్కిలు వంటి వివిధ రకాల తినుబండారాలుగా తయారు చేసి విక్రయాలు చేపడితే మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. యధాతదంగా జీడిపప్పు విక్రయాలు చేపడితే పరిశ్రమలు మనుగడ సాదించలేవని, వివిధ రకాలుగా విక్రయాలు చేపట్టిన నాడే వ్యాపారులకు మరింత లాభాలు సమకూరుతాయన్నారు. రొయ్యలు పరిశ్రమలలో ఎన్నో మార్పులు చేశారని 120 పరిశ్రమల నుంచి గ్రేడింగ్ చేసి వివిద దేశాలకు ఎగుమతి చేయడం వల్ల 16 వేల కోట్ల రూపాయలు లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. రొయ్యల పరిశ్రమల మాదిరిగా జీడిపప్పును కూడా గ్రేడింగ్ చేసి ఏఏ దేశాలకు ఏ విదంగా కావాలో తెలుసుకొని ఆ విధంగా ఎగుమతి చేయడం వల్ల లాభాలు ఆర్జించవచ్చున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రోసెసింగ్ కు ఎంతో ప్రాధన్యత ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు రాయితీ అందించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని పరిశ్రమలు అభివద్ధి చేసుకొవాలన్నారు. పరిశ్రమలకు తమ వంతుగా సహకారం అందిస్తామని, చిన్నపాటి ఫిర్యాదులు చెప్తారని వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అనంతరం పారిశ్రామిక వాడలో త్రిబుల్ ఎస్ సంతోష్, మల్ల రామేశం జీడి పరిశ్రమంలో మొక్కలు నాటి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య మండలి ఈఈ కారుణ్యశ్రీ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ హరీష్, జీడి ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, కోశాధికారి మల్లా సంతోష్ గుప్తా, జీడి పరిశ్రమ యాజమాన్యాలు బెల్లాల నారాయణరావు, తర్లానా రమేష్, శాసనపురి మురళి, మల్లా భాస్కరరావు, పలువురు జీడి వ్యాపారులు పాల్గొన్నారు.



## వెంకన్నచౌదరికి సన్మానం

**మందస, జులై 18(వార్త):** మందస పీఏసీఎస్ అధ్యక్షులుగా తమిరియ భాస్కరరావు(మందస), లబ్బ రుద్రయ్య(బాలిగాం) నియమితులయ్యారు. వీరిద్దరూ పలాస టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి, ఎమ్మెల్యే గౌతు శిరీషాను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వెంకన్నచౌదరిని ఘనంగా సన్మానించారు. తమకు పదవులను ఇచ్చిన వారిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మందస అధ్యక్షుడు భావన దుర్యోధన, నాయకులు భైరిశెట్టి గున్నయ్య, ఎం.నవీన్‌కుమార్, మంగుళపాత్రో, వాసు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన




**పలాస, జులై 18(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షిక పర్యావరణ కార్యక్రమాల భాగంగా, ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపతి రావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కీలక సందేశాన్ని ఇచ్చారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, "ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసేందుకు శతాబ్దాలు పడుతాయి. అవి నేల, నీరు, వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. పిల్లలు ఇప్పటినుంచి ఈ విషయాన్ని తెలుసుకుని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చొరవ తీసుకోవాలి," అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. మధు మాట్లాడుతూ, "ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లో ఉండే మైక్రోపార్టికల్స్ శరీరంలోకి వెళ్లి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతాయి. ఇవి భవిష్యత్తు తరాలకు ముప్పు కలిగించగలవు. అందుకే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలి," అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పచ్చదనం పెంచే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటి, ప్లాస్టిక్‌కి బదులుగా పర్యావరణ హితమైన వస్తువుల వినియోగంపై ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఐక్యస్ కోఆర్డినేటర్ పివి రమణ సమన్వయం చేశారు. సైన్స్ విభాగాధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్, ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నాగేశ్వరరావు



**సరుబుజ్జిలి, జులై 18(వార్త):** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా సురవరపు నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సరుబుజ్జిలి మండల పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో గర్వంగా తలెత్తుకునేలా పరిపాలన చేశామన్నారు. నేను వైఎస్సార్ సీపీ కార్యకర్తను అని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పు కోగలం. అన్ని పనులు ప్రజలకు చేశామన్నారు.

## రైతులకు సేవలందించండి

**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** రైతులకు సేవలందించాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. స్థానిక పి ఏ సి ఎస్ కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా నియమితులయిన పెదిని బాబ్జి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలు, రుణాలు, రాయితీలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని కోరారు.గతంలో రైతులు కానివారికి పథకాలు అందాయని అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. త్రీ మెన్ కమిటీ సభ్యులు గా గిన్నీ బాలరాజు, జనసేన బాసి భారతి లు కూడా భాద్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజు, లోపింటి పద్మనాభం, పత్రి తవిటయ్య,మెరుగు సూర్యనారాయణ,పొందల కృష్ణారావు,సదానంద రౌలో, శ్రీనివాస్ రెడ్డి,దుపాన సూర్యనారాయణ, మణి ప్రకాశ్,డి సి సి బి మేనేజర్ అనిత పండా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జయలక్ష్మి నేత్రాలు సజీవం



**శ్రీకాకుళం, జులై 18(వార్త):** శ్రీకాకుళంలోని చంపాగల్లి వీధికి చెందిన అందవరపు జయలక్ష్మి (68) శుక్రవారం కన్నుమూసిన తరువాత, ఆమె స్మారకార్థం కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో ఆమె నేత్రాలను దానం చేశారు. కుమారుడు అందవరపు సుబుద్ధి, కోడలు సత్యవతి అనుమతితో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్లు పి.సుజాత, బి.జగదీశ్ నేత్రాలను సేకరించి, విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర కేంద్రానికి పంపించారు. ఈ సేవాత్మక చర్యకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి. మల్లేశ్వరరావు, ట్రెజరర్ కె. దుర్గ శ్రీనివాస్ కుటుంబాన్ని అభినందించారు. నేత్రదానం చేయాలనుకునే వారు 78426 99321 నంబర్‌కి సంప్రదించవచ్చని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## మానవ హక్కుల సంరక్షణ అవినీతి నిరోధక సంఘం జిల్లా చైర్మన్‌గా రెడ్డి తవుడు

**ఆమదాలవలస, జులై 18(వార్త):** జిల్లా మానవ హక్కుల సంరక్షణ అవినీతి నిరోధక సంఘం చైర్మన్‌గా రెడ్డి తవుడు నియమించినట్టు నేషనల్ మానవ హక్కుల ప్రెసిడెంట్ కొండ మల్లికార్జున రెడ్డి, నేషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తనను నియమించినందుకు వారికి తవుడు కృతజ్ఞతలు తెలిపారు. తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ధర్మ మార్గములో నిర్వహిస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నేషనల్ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకు వెళ్తామని, వారికి న్యాయం జరిగినంత వరకు అండగా ఉంటామని తెలిపారు.

## పీ4తో పేదల జీవితాల్లో వెలుగులు




**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** పబ్లిక్ ప్రయివేటు పీపుల్ పార్ధనర్ షిప్ (పీ4) పై 21,22 వార్డుల సచివాలయం పరిధిలో అవగాహన కల్పించారు. ఈ విధానం తో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ అన్నారు. స్వయంశక్తి సంఘ సభ్యులుకు బంగారు కుటుంబం దత్తత పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 21 వ వార్డ్ ప్రతినిధి కాళ్ల జై దేవ్ యాదవ్, సచివాలయం సిబ్బంది లలిత్, సుమిత్ర,కృష్ణ కుమారి,స్వాతి, అర్ పి లు శ్రీదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాజా పాఠశాలకు రూ.1.40లక్షల విరాళం



**మందస, జులై 18(వార్త):** మందస పట్టణంలోని శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాల మరమ్మతులకు 1992-93వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.1.40లక్షలు అందజేశారు. ఈ నెల 18, 19వ తేదీల్లో ఈ విద్యాలయం 125 సంవత్సరాలు మహోత్సవం జరుపుకోనుంది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీర దుర్యోధన, రట్టి లింగరాజు, మద్ది రమేష్, ఆర్.షణ్ముఖరావు, ఆర్.వెంకటరమణ, పి.లోకేష్, కిషోర్ మహరణ, ప్రమోద్ కుమార్ బెహరా, హెచ్.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

## వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నరేంద్ర



**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శిగా సీని యర్ నాయకులు నర్తు నరేంద్రయాదవ్‌ను నియమించారు. తనను నియమించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జగన్మోహన్ రెడ్డికి, బి.సి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రమేష్ యాదవ్, రీజనల్ కో అర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్‌కి ఆయన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఐఐఐటీలో తొలి క్యాంపస్ డ్రైవ్ విజయవంతం

**ఎచ్చెర్ల, జులై 18(వార్త):** ఎచ్చెర్లలోని ఆర్జీయూకేటీలో మొట్టమొదటి సారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన మియామి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ డ్రైవ్‌ను నిర్వహించగా, సుమారు 180 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ, "ఐఐఐటీ స్థాపించిన తొలినాళ్లలో ఇంజనీరింగ్ విద్యార్థులకు నూజివీడులో తరగతులు నిర్వహించేవారు. అందుకే ఇప్పటి వరకు క్యాంపస్ డ్రైవ్‌లన్నీ అక్కడే జరిగాయి. రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని అవకాశాలు వస్తాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ క్యాంపస్ డ్రైవ్ విజయవంతం కావడంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, సీఎస్ఈ విభాగాధిపతి రమేశ్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వరప్రసాద్ కీలక పాత్ర పోషించారు. మియామి టెక్నాలజీస్ ప్రతినిధులు నవీన్, రవిరామ్‌వర్మ, అధ్యాపకులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశం రసాభస

**-సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు**



**సరుబుజ్జిలి, జులై 18(వార్త):** సరుబుజ్జలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కిల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. మండలంలో చేపట్టిన ఈజీఎస్ పనుల్లో నిబంధనలను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజా ప్రతినిధులు చెప్పిన గ్రామాల్లో ఎక్కువ నిధులు కేటాయించి అవసరం ఉన్న గ్రామాలకు తీరని అన్యాయం చేశారని సరుబుజ్జలి ఎంపీటీసీ సభ్యుడు పంచాయితీ రాజ్ శాఖ ఏఈ ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులకు అనుగుణంగా నిధులు కేటాయించారని, దీనిపై సమాధానం చెప్పాలని ఏఈని నిలదీశారు. స్పందించిన జెడ్పీటీసీ సురుపు నాగేశ్వర రావు మాట్లాడుతూ ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. ఈ పనుల కేటాయింపు పై వివరణ ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో కోరారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని అన్నారు. రోజుకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని,దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశంలో ప్రస్తావించారు. ఈ విషయమై స్పందించిన ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్ ఈ సమస్యను విద్యుత్‌శాఖ ఇంజనీర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అధికారులు జాప్యం చేయడం సరైంది కాదని వైస్ ఎంపీపీ పేర్కొన్నారు. గ్రామాల్లో రైతు వేదికల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ అం గన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని, దీంతో పిల్లలు, మహిళలు అనారోగ్యం బారిన పడుతున్నారని ప్రస్తావించారు. ఈ మేరకు సమావేశానికి హాజరైన సూపర్‌వైజర్ నిలదీశారు. మూడు నెలలుగా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగానే గుడ్ల పంపిణీ జరిగిందని, అలాంటిదేమీ లేదని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను అసలు మీరు సందర్శిస్తున్నారా.. అక్కడ ఏం జరుగుతుందో మీరు పట్టించుకోవడం లేదని సభ్యులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులపై ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తయిందని, అన్ని ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని వివరించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ ఏఈ చెబుతున్న మాటలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయని, ఇక్కడ వాటర్ ట్యాంకులు అనుకున్న విధంగా పూర్తి కాలేదని తెలిపారు. ఈ విషయమై తప్పుడు లెక్కలు చెప్పవద్దని ఏఈని మందలించారు. ఈ సమావేశానికి 22 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. కాగా కేవలం 10 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. అధికారుల గైర్హాజరుపై పట్టించుకోకపోవడం గమనార్హం.

సమావే శంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ సర్పంచ్‌లు, మండల హార్టి ల్చర్ అధికారి వ్యవసాయ అధికారి, పంచాయతీరాజ్ ఏఈ పాల్గొన్నారు.

# రైతులు ఎరువులు కొంటే బిల్లు తప్పనిసరి



**పలాస, జులై 18(వార్త):** రైతులు ఎరువుల మందుల దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన పురుగుల మందులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో గల ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తాళాసు గోవిందరావు రిటైల్ ఎరువులు, పురుగు మందులు దుకాణం తనిఖీలో భాగంగా ప్రతి సంవత్సరం మండల వ్యవసాయధికారికి సమర్పించాల్సిన ఫారం 10 సమయానికి సమర్పించకపోయిన విషయాన్ని గుర్తించారు. దీని వలన ప్రొఫెక్స్ సూపర్ అనే పురుగుల మందు యొక్క 100 మిల్లి లీటర్లు సామర్థ్యం గల 62 సీసాలు 5270 రూపాయలు విలువ గల పురుగుల మందులు అమ్మకాలను నిలుపుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విక్రయించిన ఎరువులకు పురుగు మందులకు బిల్లులను తప్పని సరిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్స్, ఈ పాస్ మెషిన్ లో ఎరువులు సమాచారం సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

తనిఖీ బృందంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి విజయప్రసాద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ డిపార్ట్మెంట్ ఆదారి సంతోష్‌కుమార్, మండల వ్యవసాయ అధి కారి కిల్లి పోలరావు, డిఏఓ కార్యాలయం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట రావు,వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి : ఎంజీఆర్



**పాతపట్నం, జులై 18(వార్త):** పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ మామిడి గోవిందరావు తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గత ప్రభుత్వం పాలనల్లో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలో ఉన్నాయని తెలిపారు. ప్రజా సమస్య వేదిక లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతులకు సబ్సిడీపై డ్రోన్ల పంపిణీ..

పాతపట్నం పంచాయతీకి చెందిన రైతు గ్రూపులకు 80% సబ్సిడీతో మంజూరు చేసిన డ్రోన్ లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్‌తో పురుగు మందులు పిచికారి చేయడంతో కూలీల కొరత తను అధిగమించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేయొచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఎమ్మెల్యేని కలిసిన ఏఎంసీ చైర్మన్ గౌరమ్మ



పాతపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన చిన్నింటి గౌరమ్మ శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు గౌరమ్మ వెంకటాపురం గ్రామానికి రెండు పర్యాయాలు, ఆమె భర్త రాములు ఒక పర్యాయం, కుమార్తె ప్రభావతి ఒకసారి సర్పంచ్ గా పనిచేశారు. గౌరమ్మ అల్లుడైన బైరిసింగి దినకరరావు ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా సేవలందించారు. పాతపట్నం ఏఎంసీ చరిత్రలో మొదటిసారి మెలియాపుట్టి మండలానికి చైర్మన్‌గా గిరిజన మహిళను పదవిని కట్టబెట్టడంపై పలువురు గిరిజన నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 22వరకు శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

**శ్రీకాకుళం, జులై 18(వార్త):** జిల్లాలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో రెండో విడత ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేశారు. విద్యార్థులు, నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్‌లో అప్లై చేసి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాలని, అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా e-itirap.gov.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని అధికారులు తెలిపారు. అభ్యర్థులు జూలై 22న మధ్యాహ్నం ఒంటి గంటలోపు ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ, శ్రీకాకుళం క్యాంపస్‌కు హాజరై తమ అసలు ధ్రువపత్రాలను పరిశీలన (వెరిఫికేషన్) కోసం సమర్పించాలి. ఇప్పటివరకు మొత్తం 763 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 571 మంది మాత్రమే తమ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. ఇంకా 192 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉందని, వీరంతా గడువులోగా హాజరుకావాలని అధికారులు కోరారు. కౌన్సెలింగ్ 23న ఉదయం 10 గంటలకు డీఎల్‌టీసీ/ఐటీఐ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా బ్యూటీషియన్, డిజైనింగ్ అనే కోర్సు అందుబాటులో ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కోర్సు ద్వారా పాఠశాలల్లో క్రాఫ్ట్ టీచర్లకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోంది

**-సంతబొమ్మాళి మండల కార్యకర్తల**

**సమావేశంలో ధ్వజమెత్తిన వైసీపీ జిల్లా నేతలు**




**సంతబొమ్మాళి, జులై 18(వార్త):** రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయలేని కూటమి ప్రభుత్వం హామీలపై ప్రశ్నిస్తుంటే దాడులకు పాల్పడుతున్నారని తమ్మినేని ఆరోపించారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం పై దండుగోపాలపురంలో సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఉపముఖ్యంత్రి ధర్మాన కృష్ణ దాస్, వైసీపీటెక్కలి నియోజకవర్గ ఇన్చార్జి పేరాడ తిలక్ ముఖ్య అతిదులుగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.కూటమి ప్రభుత్వం చేసిన సూపర్ సిక్స్ మోసాలు పై ప్రజలను చైతన్యం చెయ్యాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీల వల్ల రాష్ట్రంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఒక ఏడాదిలో ప్రజలకు పథకాల కింద రావాల్సిన 80 వేల కోట్లను చంద్రబాబు ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. ల్యాండ్ మాఫియా అండ్ లిక్కర్ మాఫియాకు పాల్పడుతూ అచ్చెన్నాయుడు కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలు నాయకులపై అణచివేత ధోరణితో వ్యవహరిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో చేస్తున్న అరాచకాలను దాడులను ప్రతిఘటించి కార్యకర్తలకు అండగా నిలిచేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని కార్యకర్తలు ధైర్యంతో పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. గ్రామ స్థాయిలో ఇన్ చార్జీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నాయకులు సమన్వయం తో బాబు షూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమానికి నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు మార్పు అశోక్ చక్రవర్తి , జడ్పిటిసి పాల వసంత రెడ్డి ,ఎంపీపీ ప్రతినిధి మెరుగు అప్పారావు. వైస్ ఎంపీపీ ప్రతినిధి నక్క భీమారావు.వైస్ ఎంపీపీ ప్రతినిధి పొందల రామకృష్ణ,

మాజీ పిఏసియస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు (గోవింద్), జిల్లా కార్యదర్శి ఎన్ని మన్మధరావు. మహిళా అధ్యక్షురాలు జోగి రాములమ్మ, ఏ ఎం సి ప్రతినిధి సుగ్గు రామిరెడ్డి సర్పంచ్, మార్పు నాగభూషణం, కోత సతీష్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

**పలాస, జులై 18(వార్త):** సమస్యల పరిష్కారానికి మొదట ప్రాధన్యత ఇస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస నియజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కారం చేసుకోవాలని సూచించారు. నిరంతరము తాను ఎప్పుడు పని చేస్తున్నానని, సహకరించాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్య క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఉదయం నుంచి పలాస మున్సిపాలిటీ, పలాస రూరల్, మందస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి ప్రజలు వచ్చి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తెలుగుతమ్ముళ్లు పాల్గొన్నారు.

## 13 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లో 13 కిలోల గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని టౌన్ ఎస్ఐ ఎమ్.ముకుంద రావు అరెస్ట్ చేసినట్లు సి ఐ ఎం.చిన్నం నాయుడు చెప్పారు. ఆయన తెలిసిన వివరాలు ప్రకారం గజపతి జిల్లా మోహన బ్లాక్ కి చెందిన సునీల పైకా, ముంబై కి చెందిన త్రిలోక్ నాథురమ్ దోల్ పురియ మరో మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ముంబై లో గంజాయి వ్యాపారం చేసే అజయ్ చౌరసియా తనకు తెలిసిన త్రిలోక్ నాథురమ్ కి చెప్పగా ఒడిశా కర్టింగ్ గ్రామానికి చెందిన సునీల్ పాయక మరో మైనర్ బాలుడు అనంత బిరో వద్ద కిలో రూ.3 వేలకు 13.090 కిలోల గంజాయి కొని కిలో రూ.8 వేలకు అమ్మేందుకు తరలి స్తుండగా పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**పాతపట్నం, జులై 18(వార్త):** బూరగాం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో – తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించేలా పనిచేస్తున్నామన్నారు. ఏడాదికాలంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, మండల క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జ్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మందస, జులై 18(వార్త):** సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, క్లస్టర్ ఇంచార్జి దాసరి తాతారావు అన్నారు.మందస మండలంలోని లొహరిబందలో దాసరి తాతారావు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయిడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలు అందివ్వడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ విధానాలతో అన్యాయం జరిగిందని, నేడు ఆ పరిస్థితిలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్రి కోదండరావు, బూత్ కన్వీనర్ అందాల మోహనరావు, జోగ జానకిరావు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



## డి.మత్స్యలేశంలో మూడు మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం

**ఎచ్చెర్ల, జులై 18(వార్త):** ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామంలో వైశాఖీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన మూడు ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్లను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యకలాపాలలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధజలాలు అందించడంలో వైశాఖీ ఫౌండేషన్ చూపుతున్న కృతజ్ఞతాభావం ప్రశంసనీయం" అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం

### శాసనసభ్యుడు గొండు శంకర్

**శ్రీకాకుళం, జులై 18(వార్త):** ప్రతీ సమస్యకు పరిస్కారమార్గం చూస్తానని శాసనసభ్యులు గొండు శంకర్ శుక్రవారం అన్నారు. స్థానిక విశాఖ కోలనీలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించారు. శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, కళింగపట్నం, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అర్జీలపై చర్యలు చేపట్టాలి

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం**

**-17 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, జులై 18(వార్త):** అర్జీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జడ్పీ సీఈవో, విభిన్న ప్రతిభావంతుల ఇన్ చార్జ్ సహాయ సంచాలకులు ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ ను ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వచ్చిన అర్జీలుపై తీసుకున్న చర్యలు తెలియజేయాలన్నారు.బ్యాటరీ సైకిల్ కోసం, సదరం సర్టిఫికెట్, ఫీంఛన్లు, హౌసింగ్, ఉపాధి, వినికిడి మిషన్ లపై 17 అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ఉద్యోగుల గ్రీవెన్స్ పై ఏపి ఎన్జీఓ నాయకులు హెచ్. సాయిరాం కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కొన్నింటికి మాత్రమే వైద్యం జరుగుతున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో, విభిన్న ప్రతిభా వంతులు శాఖ ఇన్ చార్జ్ ఎ.డి.ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546